క్లుప్తంగా

భీమవరంలో పవన్‌ను నమ్మే పరిస్థితి లేదు


తోట భోగయ్య, కాపునాడు పట్టణ అధ్యక్షుడు


మాదిరెడ్డి శ్రీనివాస్ కాపు నాయకులు, భీమవరం

భీమవరం (ప్రకాశం చౌక్): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే భీమవరం గుర్తుకు వస్తోందని, ఈసారి కూడా భీమవరం వాసులు పవన్‌ను నమ్మే పరిస్థితి లేదని కాపునాడు పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, కాపు నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో పవన్‌కు ఓటు వేసిన ప్రజలను, తన కోసం పని చేసిన కాపులను కూడా కరోనా సమయంలో పవన్ పట్టించుకోలేదని విమర్శించారు. టూరిస్ట్ మాదిరిగా భీమవరం వచ్చి వెళుతున్నాడని ఎద్దేవా చేశారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

సాక్షి, భీమవరం: యువత వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి మార్గంలో నడవాలని బ్రౌనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎలీషా అన్నారు. పట్టణంలోని బ్రౌనింగ్ కళాశాలలో గురువారం ఎస్ఐఓ ఆధ్వర్యంలో యువత సమస్యలు, కారణాలు, పరిష్కారం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని వివరించారు. చెడు మార్గంలో పయనించకుండా చదువుపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను ఏర్పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐఓ శాఖ సభ్యులు మొహ్మద్ తాహా, ఎండీ సమీర్, షేక్ సుభాని పాల్గొన్నారు.

జర్మనీ వర్సిటీతో ఎస్ఆర్‌కేఆర్ ఒప్పందం


జర్మనీ వర్సిటీ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విద్యార్థులు జర్మనీలో స్కాలర్‌షిప్‌తోపాటు ఉన్నత విద్య అభ్యసించేందుకు అక్కడి విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ గురువారం చెప్పారు. జర్మనీలో విశ్వవిద్యాలయాలను సందర్శించి ఇండో యూరోపియన్ సింక్రనైజేషన్ (ఐస్) సహకారంతో జర్మనీ యూనివర్సిటీ అధికారులతో సమావేశమై ఒప్పందం చేసుకున్నామన్నారు. దీనిలో భాగంగా నాలెడ్జ్, స్కిల్ ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ప్రాజెక్టుల రూపకల్పన, కళాశాల స్థాయిలోనే జర్మన్ భాష నేర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మోషేన్‌రాజును కలిసిన పొన్నమండ


మోషేన్‌రాజును కలిసిన బాలకృష్ణ

పాలకోడేరు: ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు దౌర్జన్యాలు జరగకుండా అరికట్టడంతో పాటు ఇతర వర్గాలతో కలిసి మెలిసి ఉండేలా కృషి చేయాలని ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఉద్బోధించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన పొన్నమండ బాలకృష్ణ గురువారం మోషేన్‌రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణను మోషేన్‌రాజు అభినందించారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

సాక్షి, భీమవరం: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ భీమవరంలో శుక్రవారం నిర్వహించనున్న వారాహి యాత్ర, బహిరంగ సభ దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ మళ్లిస్తున్నామన్నారు. వాహనాలకు పార్కింగ్ స్థలాలను కూడా కేటాయించినట్లు తెలిపారు.

నేడు బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నిక

నరసాపురం రూరల్: నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నిక శుక్రవారం నిర్వహిస్తామని ఎన్నికల అధికారి పూర్ణిళ్ల శ్రీనివాస్, నిర్వహణ కమిటీ సభ్యులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ గురువారం తెలిపారు. అధ్యక్ష పదవికి తానుకొండ సంతోష్ కుమారి, చల్లా దానయ్యనాయుడు పోటీలో ఉన్నారని, ఎన్నిక ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. మొత్తం 162 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, పోలింగ్ పూర్తయిన వెంటనే ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తామని వెల్లడించారు.

హామీల అమలులో జగన్ ప్రభుత్వం రికార్డు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం


ఉండిలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ఎన్నికలకు ముందు ప్రజలకు చేసిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి మూడో నంబర్ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామసర్పంచ్ కతమం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారామణరాజు, వార్డు సభ్యుడు అడబాల వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధికి సంబంధించిన వివరాలతో కూడిన పత్రాలను అందజేశారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ దేశంలో ఇంత వరకు ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలు నూటికి కనీసం 50 శాతం కూడా నెరవేర్చిన నాయకుడు ఎవ్వరూ లేరన్నారు. కానీ ప్రజలకిచ్చిన వాగ్దానాలను పవిత్రంగా భావించి 97 శాతం నెరవేర్చిన ఒకే ఒక్క నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.చెప్పిన మాటకు, చేసిన వాగ్దానానికి ఎంతో గౌరవమిచ్చే గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. ఇంతగొప్పగా ఏ ముఖ్యమంత్రి ప్రజలకు లబ్ధి చేకూర్చలేదని నిరుపేదలను, మధ్య తరగతి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన మహానాయకుడు వైఎస్ జగన్ అన్నారు. అందుకే ఏ గ్రామానికి, ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు హారతులు పడుతున్నారన్నారు. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేయాలని చూస్తున్న ప్రతిపక్షాలు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు అడుగడుగునా అడ్డుతగులుతున్నారన్నారు. ప్రజలకు జరిగే మంచిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాల తీరుతెన్నులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో అతి కొద్దిస్థానాలకే పరిమితం చేసిన ప్రజలు ఇప్పుడు అవి లేకుండా ప్రతిపక్షాలను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175 స్థానాలు గెలుచుకోవడం తథ్యమని అన్నారు. ప్రతి గ్రామాన్ని జల్లెడపట్టి దానిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే సంక్షేమ పథకాలు ఎవరైనా ఏ కారణం చేతనైనా అందకపోతే వారికి కూడా ఇవ్వాలనే ఉద్దేశంతో ఇప్పుడు కొత్తగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. దీని ద్వారా ఎవరికైనా ఏవైనా ధ్రువీకరణ పత్రాలు కావాల్సి ఉంటే అధికారులు ఇంటికే వచ్చి అందజేసి సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తారన్నారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న చిన్న వంతెన పునఃనిర్మాణానికి రూ.10 లక్షలు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మరో రూ.10 లక్షలతో, మండల నిధులతో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామని పీవీఎల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వీరమల్లు సత్యవతి, గిరడ రమణ, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున, కమతం బెనర్జీ, బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, గుండాబత్తుల సుబ్బారావు, బాతు జాన్సన్, బడుగు బాలాజీ, అంగర రాంబాబు, రాయి సతీష్, శేషాద్రి శ్రీను, గలావిల్లి ధనుంజయ, బొచ్చా అచ్చారావు, గుండు నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు నిమ్మల కేశవకుమార్, గాంధీ రాజు, పీ రామరాజు, గిరడ శ్రీను, అందుకూరి రాజు, సిరికి ఎర్రయ్య, మల్లువలస సత్యనారాయణ, కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పేరిచర్ల సూర్యనార్యాయణరాజు, చిట్టూరి జార్జ్, కడలి శ్రీను పాల్గొన్నారు.

నేడు చినకాపవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఆకివీడు: మండలంలోని చినకాపవరం గ్రామంలో గడపగడపకున ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారిణి కందుల వాణి గురువారం చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు హాజరవుతారని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా ధ్రువపత్రాలు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా ఇస్తామని ఎంపీడీవో ఏవీ అప్పారావు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ, జనన, మరణ, మ్యూటేషన్, టైటిల్ డీడ్, వివాహ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు, పట్టాదార్ ఆధార్ సీడింగ్, ల్యాండ్ రికార్డ్స్, కౌలు రైతు (సీసీఆర్‌సీ) కార్డులు, రైస్ కార్డు వంటి సేవలకు ధ్రువపత్రాలు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వీటి కోసం స్థానిక సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించి కావలసిన పత్రాలను అందిస్తే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వేగంగా అందిస్తామని ఎంపీడీవో తెలిపారు.

విధుల్లో చేరిన ఎంఈఓ–1, 2 అధికారులు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎంఈఓ–2 పోస్టుల్లో అధికారులు విధుల్లో చేరారు. ఆకివీడు ఎంఈఓ–2గా జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెల్లూరి సీతారామయ్య, ఉండి ఎంఈఓ–2గా వీరవాసరం ఎంఈఓ వినాయకుడు, కాళ్లకు చెరుకుమిల్లి జెడ్పీ స్కూల్ హెచ్ఎం గాదిరాజు కనకరాజు, పాలకోడేరుకు బొండాడ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆకివీడు ఎంఈఓ ఎ.రవీంద్ర, కాళ్ల ఎంఈఓ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఉండి ఎంఈఓ–1కు తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం, పాలకోడేరు ఎంఈఓ–1 పోస్టుకు యండగండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు


ఆకివీడులోని చిన్నమసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆకివీడు: బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. స్థానిక పెద్ద మసీదు నుంచి అన్ని మసీదులకు చెందిన ముస్లిం పెద్దలు, యువకులు జాతీయ రహదారి మీదుగా ప్రదర్శన నిర్వహించి, వెలంపేట మీదుగా తీగలదొడ్డి వద్ద చిన్న మసీదుకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ముస్లిం పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు అభిషేకాలు

అత్తిలి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈదూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు 200 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం, 7 లీటర్ల పెరుగు, 7 కిలోల నెయ్యి, 7 కిలోల తేనె, 7కిలోల పంచదార, 7కిలోల పసుపు, 7 కిలోల కుంకుమ, 7కిలోల అష్టగంధం, 7కిలోల వట్టివేళ్లు, 7 రకాల పళ్లరసాలు, 7రకాల చూర్ణాలు, వివిధ సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకాన్ని జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

లక్ష్మీనారాయణ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏకాదశి పురస్కరించుకొని పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారికి గురువారం ఉదయం పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో విశేషంగా అభిషేకం జరిగింది. ఆర్యవైశ్య సంఘం కోశాధికారినున్న బాలా త్రిపుర సుందరరావు, సెక్రటరీ శ్యాం తదితరులు పూజలలో పాల్గొన్నారు. విశేషంగా భక్తులు హాజరయ్యారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు


స్వామివారిని దర్శించుకుంటున్న గ్రంధి రవితేజ


పైనాపిల్ పండ్ల అలంకరణలో శ్రీఉమాసోమేశ్వరస్వామి


జువ్వలపాలెం రోడ్డులో వెంకన్నకు సహస్ర తులసి పూజ చేసిన దృశ్యం


శాకంబరి దేవి అలంకరణలో బాలత్రిపుర సుందరీదేవి


మాదివాడలోని వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

భీమవరం (ప్రకాశం చౌక్): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని వైష్ణవాలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లు, స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పంచారామక్షేత్రంలో..

పంచారామక్షేత్రం గునుపూడిలోని శ్రీఉమాసోమేశ్వరజనార్దన స్వామి వారి దేవస్థానంలో తొలిఏకాదశి సందర్భంగా శ్రీఉమాసోమేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, సోంబాబు ఆధ్వర్యంలో స్వామి వారికి అనాస పండ్లతో ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ స్వామివారిని దర్శించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు, ఈవో చాగంటి సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో..

శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో తొలిఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు. జువ్వలపాలెంలోని శ్రీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో తొలిఏకాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి, స్వామివారికి సహస్ర తులసి, పుష్పార్చన పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ధార్మిక పరిషత్ సభ్యులు మంతెన రామ్‌కుమార్‌రాజు, కార్యనిర్వహణ అధికారి రుద్రరాజు గంగాశ్రీదేవి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా బాలత్రిపుర సుందరీదేవి

అషాడమాసం తొలి ఏకాదశి సందర్భంగా మెంటేవారి తోటలోని బాలత్రిపుర సుందరిదేవి అమ్మవారికి 25 రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరి దేవిగా అలంకరణ చేశారు. మారిశెట్టి తాతారావు, సత్యకుమారి దంపతులతో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 25 రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో నంద్యాల రవివర్మ, రాజారాణి దంపతుల ఆధ్వర్యంలో 50 మందిలో దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.

నారాయణ నామంతో హోరెత్తిన ఆలయాలు

ఆకివీడు: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం వైష్ణవాలయాలు నారాయణ స్మరణతో హోరెత్తాయి. గోవిందా, నారాయణా అంటూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆషాఢమాసంలో నారాయణుడ్ని దర్శించుకోవడం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయడం ద్వారా శాంతి, లోక కల్యాణం జరుగుతుందని భక్తుల నమ్మిక. తొలిఏకాదశి రోజున స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. పిల్లలమర్ అగ్రహారంలోని వేంకట లింగేశ్వరస్వామి ఆలయంలో శాంతి హోమం నిర్వహించారు. మాదివాడలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

బాబా ఆలయంలో పీవీఎల్ పూజలు


సీసలి బాబా ఆలయంలో బాబా ప్రతిమను పివిఎల్ అందిస్తున్న దృశ్యం

కాళ్ల: సీసలిలో వేంచేసియున్న షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా గురువారం స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన బాబావారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు పీవీఎల్‌ను సత్కరించి బాబా వారి ప్రతిమను అందజేశారు. గురువారం తొలి ఏకాదశి కావటంతో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోపల్లె, కలవపుడి సొసైటీల అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, గణేశ్న రాంబాబు, సాగిరాజు హరివర్మ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

పెనుగొండ: ఏకలవ్య జయంతి వేడుకలను కరుగోరిమిల్లి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో గ్రామంలో ప్రతిష్టించిన ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య సర్పంచ్ అల్లం పద్మావతి, ఎరుకుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాలశక్తి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి ముత్యాల నాగేశ్వరరావు, ముత్యాల జగ్గారావు, సలాది శ్రీరంగారావు, కాంపాటి నాగరాజు, పెచ్చెట్టి శ్రీనులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కార సభ


రామమోహనరావును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఉత్తమ విలువలతో కూడిన మానవ సంబంధాలతోనే మెరుగైన బ్యాంక్ సేవలు అందించవచ్చని మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీసులో చీఫ్ మేనేజర్ ఆదూరి రామమోహనరావు ఉద్యోగ విరమణ సత్కార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ పి.సంగీత కుమారి, డీఆర్ హెచ్.దివాకర్, వెంకటేశ్వరరావు, చీఫ్ మేనేజర్లు పి.మూర్తిరాజు, పీవీకే శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి


సుధీర్‌బాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మోషేన్‌రాజు

సాక్షి, భీమవరం: అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. గునుపూడికి చెందిన గ్రే హౌండ్స్ కానిస్టేబుల్ పి.సుధీర్ బాబు 15వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ బలిమెల రిజర్వాయర్ వద్ద నక్సల్స్ జరిపిన దాడిలో సుధీర్‌బాబు ప్రాణాలు అర్పించి అమరుడయ్యాడన్నారు. అనంతరం సుధీర్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్‌బాబు దేశం, రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి అని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

జనసేన నేతల పడిగాపులు

- ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు దక్కని పవన్ దర్శనం
- సమావేశానికి వెళ్లకుండా అడ్డుకోవడంపై ఆవేదన


భీమవరంలో జనసేన కార్యకర్తలను తోసేస్తున్న దృశ్యం


కార్యకర్తలకు సర్దిచెబుతున్న వీరవాసరం జెడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు


బైక్‌లతో హంగామా చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: గత నాలుగు రోజులుగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మకాం వేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలవడానికి వచ్చిన ఆ పార్టీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర నాయకులను ఫంక్షన్ హాలులోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీనిలో భాగంగానే గురువారం పవన్‌ను కలవడానికి వచ్చిన పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ప్రధాన గేటు వద్ద అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. దీంతో పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీపై మక్కువతో లక్షలాది రూపాయల ఖర్చుతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా తమకే పార్టీ అధినేతను కలిసే అవకాశం కల్పించకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఎంతో అభిమానంతో పవన్‌ను చూడటానికి పడిగాపులు పడుతున్నా కనీసం పలకరించని పరిస్థితిలో తాము పార్టీకి ఎలా పనిచేస్తామంటూ ధ్వజమెత్తుతున్నారు. కార్యకర్తలకు పవన్ దర్శనభాగ్యం లేకపోవడంతో తీవ్ర నిరాశతో ఎదురుతిరుగుతున్నారు.

సైలెన్సర్లు లేని మోటార్ సైకిళ్లతో జనసైనికుల హంగామా

పట్టణంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బస చేయడంతో పార్టీ శ్రేణులు, పవన్ సినీ అభిమానులు మోటార్ సైకిళ్లకు సైలెన్సర్లు తీసి భారీ శబ్దాలతో అలజడి సృష్టిస్తున్నారు. ఎర్ర కండువాలను తలకు చుట్టుకుని పార్టీ జెండాలు చేతబూని పట్టణంలోని వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ రోడ్లపై నడిచే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాళ్ల మండలానికి చెందిన కొంతమంది జనసైనికులను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని హెచ్చరించి వదిలారు. ఇంత జరుగుతున్నా పార్టీ అధినేతలు అలజడి సృష్టించే కార్యకర్తలను అదుపులో పెట్టడం మాని అల్లరి చేసేవారు తమ పార్టీ కార్యకర్తలు కాదంటూ చేతులు దులుపుకోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సైలెన్సర్లు లేని మోటార్ సైకిళ్ల అలజడి నేపథ్యంలో శుక్రవారం రాత్రి భీమవరంలో నిర్వహించే బహిరంగ సభ ఎలా ముగుస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.